క్లుప్తంగా

సస్యరక్షణ చేపట్టాలి



మున్నంగిలో పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు

మున్నంగి(కొల్లిపర): రైతులు జొన్న, మొక్కజొన్న పంటల్లో సస్యరక్షణ చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఉప వ్యవసాయ సంచాలకులు పి.రామాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి, మేలైన యాజమాన్య పద్ధతులపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే మార్గాలను వివరించారు. మిత్ర పురుగుల ఉధృతిని పెంచుకుని శత్రు పురుగులను నివారించే మార్గాలపై చైతన్యం కల్పించారు. పొలంబడి కార్యక్రమాన్ని రైతులందరూ ఉపయోగించుకొని, తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త నగేష్ , తెనాలి ఏడీఏ కె.వెంకటరావు, వీఏఏలు మహాలక్ష్మి, గోపిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



విశ్రాంత డీఎస్పీ వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఆశ్రమవాసులు

తెనాలిటౌన్: కొల్లావారి వీధిలోని మహాత్మ ఆశ్రమంలో గురువారం విశ్రాంత డీఎస్పీ చందు వెంకటేశ్వరరావు, నగరాజలక్ష్మి కుమారి దంపతుల 50వ పెళ్లిరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు మిఠాయిలు పంచిపెట్టి, అన్నదానం చేశారు. ఆశ్రమ వాసులు వెంకటేశ్వరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

12న బీపీ మండల్ విగ్రహావిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

తెనాలిటౌన్: సామాజిక న్యాయ యోధుడు బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణ ఈ నెల 12న గుంటూరు అమరావతి రోడ్డులో సినీ స్కేర్ జంక్షన్ నందు జరుగుతుందని యాదవ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాడిబోయిన అఖిలేష్ తెలిపారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని బృందావనం హోటల్‌లో గురువారం విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్, కర్నాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, తెలుగు రాష్ట్రాల్లోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో అసోసియేసన్ జిల్లా అధ్యక్షుడు మేకల శివరామకృష్ణారావు, జనరల్ సెక్రటరీ వీవీ శ్రీనివాస్, ఆరాధ్యుల సాంబశివరావు, అంబరీషుడు, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

తెనాలిరూరల్: భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని నాజరు పేటకు చెందిన నక్కా రవి కుమార్(33) కూలి పనులకు వెళ్తుంటాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇటీవల అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రమ్మంటే ఆమె రాకపోవడంతో మనస్థాపానికి గురై ఈ నెల 5న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గుంటూరు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డుల చేయూత అభినందనీయం



నగరంపాలెం: ఉద్యోగ విరమణ చేసిన మహిళా హోంగార్డుకి సహచర హోంగార్డులు ఆర్థికంగా చేయూతనివ్వడం అభినందనీయమని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 9న ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు జి.కనకదుర్గకు హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.32 లక్షల చెక్కుని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్‌కృష్ణన్, ఎస్‌బీటీ శ్రీనివాస్, సుధీర్ పాల్గొన్నారు.

తెనాలి పట్టణంలో రోడ్ల మరమ్మతులకు ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపాలిటీలోని 40 వార్డుల్లో రోడ్ల మరమ్మతులు చేయించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 30వ వార్డు అమరావతి ప్లాట్స్ నుంచి గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ కొమ్మర బత్తిన జయపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎక్కువ మంది రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నట్లు చెప్పారు. వారంలో మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. వార్డుల వారీగా పనులు ప్రారంభించి, వాటిని స్వయంగా తానే పర్యవేక్షిస్తానని చెప్పారు. స్థానిక వార్డులోని ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో కొందరు యువకులు మద్యం సేవించి ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆయా ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించటం జరిగిందన్నారు. అలాగే పెట్రోలింగ్‌ను కూడా ముమ్మరం చేశామని, ప్రశాంతమైన వాతావరణాన్ని కలుషితం చేయవద్దని సూచించారు. టీడీపీ కంచుకోటగా ఉన్న వార్డులో గత ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి అఖండ మేజార్టీని అందించారని కృతజ్ఞతా భావం వ్యక్తం చేశారు. ప్రజలు తమ పట్ల చూపించిన ప్రేమను మరింత పెంచుకునే విధంగా ప్రయత్నిస్తామన్నారు. వార్డులో వచ్చిన ప్రతి గ్రీవెన్స్‌ను కొద్ది నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, పేరం సంజీవరెడ్డి, షేక్ ఇస్మాయేల్, గోగిరెడ్డి మానసరెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, 30వ వార్డు నాయకులు గుమ్మడి నారాయణరావు, ఏసీ సిద్ధయ్య, నాగరాజు, కనపర్తి రజనీ, ఎం.గోపిచంద్, కె.వెంకట్రావు, ఎ.రమేష్, ఎస్.పురుషోత్తం, కె.వినోద్, వై.యోహాన్, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్, చుండూరి వెంకటేశ్వరరావు, కఠారి హరీష్, చుండూరు సాయి, రావి శ్రీనివాసరావు, చుక్కా ఆనంద్, షేక్ గఫూర్, కుర్రా శ్రీను, అడుసుమల్లి శ్రీనివాసరావు, కాళిదాసు వెంకట సత్యం, తాడిబోయిన పోలురాజు, ఈద్గా గౌస్, నాగసరపు కృష్ణ, కట్టా బుల్లయ్య, మదీరా రవితేజ, జి.మోహనరావు, రావి రాంబాబు, మున్నంగి వేణుగోపాల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, కాళిదాసు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో ఎరువుల నియంత్రణ అవసరం



మొక్కజొన్న పొలంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి వెంకటేశ్వర్లు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని మొక్కజొన్న పొలాలను గురువారం జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, మండల ఏఓ జి.ప్రేమ్‌సాగర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో జిల్లా అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడారు. మొక్కజొన్న, జొన్న పంటలకు ఎరువులు తగు మోతాదులో వేయాలన్నారు. మొక్కజొన్నకు ఎకరానికి 48కిలోల నత్రజని, 24కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ వేయాలని సూచించారు. జొన్న పైరులో 40కిలోల నత్రజని, 24కిలోల భాస్వరం, 16కిలోల పొటాష్ సరిపోతుందన్నారు. ఆర్బీకేలో పంట నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎరువులు సరిపడా ఉన్నాయని, ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. వీఏఏలు నాగేంద్ర, వంశీ, నాగరాజు, ఏఈఓ మోహన్, రైతులు ఉన్నారు. అలాగే.. నందివెలుగు పంచాయతీ కార్యాలయంలో అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరం 2023 సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ డాక్టర్ ప్రవీణ చిరు ధాన్యాల ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, వీఏఏలు సాయిదీపిక, లక్ష్మీ, ఏంజిల్, సంసోనమ్మ, అనూష, మౌనిక, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

'భజన కీర్తన'ల సీతామహాలక్ష్మికి సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం రాము చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం కదలడు వదలడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ భజనకీర్తనల కళాకారిణి కొక్కిలగడ్డ సీతామహాలక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండూరి లక్ష్మీకుమారి, చందు కోటేశ్వరమ్మ, నాగదేవలక్ష్మి, మాదల కోటేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజనతో బాలికలకు భరోసా

అవగాహన సదస్సులో చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్



పాస్‌బుక్ అందజేస్తున్న ఖలేదా నసీమ్

తెనాలి: పోస్టల్ శాఖ అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజన పథకం ఆడ పిల్లల బంగారు భవితకు కొండంత భరోసానిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని పోస్టల్‌శాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం సుకన్య సమృద్ధి యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఖలేదా నసీమ్ మాట్లాడుతూ కేవలం బాలికల కోసం మాత్రమే పోస్టల్ శాఖ ఈ పథకం ప్రవేశపెట్టిందని చెప్పారు. పదేళ్లలోపు బాలికల పేరిట ఖాతాను తెరచి, పొదుపు చేసుకోవాలని సూచించారు. బాలికల ఉన్నత విద్యకు, వారి ఆర్థిక భద్రతకు సుకన్య సమృద్ధి యోజన పథకం తోడ్పడుతుందన్నారు. తనవంతుగా ఒక బాలిక పేరుతో సుకన్య యోజన ఖాతాను ప్రారంభించి ఆ ఖాతాలో 21 సంవత్సరాలు పొదుపు చేస్తానని సభా ముఖంగా ప్రకటించారు. వైష్ణవి జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ తపాలశాఖ నిబద్ధతతో అమలుచేస్తున్న సుకన్య సమృద్ధి యోజన అద్భుత పథకమని చెబుతూ తన వంతుగా పది ఖాతాలకు ప్రథమ డిపాజిట్‌ను అందిస్తానని హామీ ఇచ్చారు. పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్ మాట్లాడుతూ తెనాలి డివిజన్ వ్యాప్తంగా ఇప్పటికి 30 వేల ఖాతాలు ప్రారంభించినట్టు చెప్పారు. సుకన్య సమృద్ధి ఖాతాలను ప్రారంభించిన ఆడపిల్లలకు, వారి తల్లిదండ్రులకు అతిథుల చేతులమీదుగా పాస్‌బుక్‌లను అందజేశారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాధాకృష్ణమూర్తి, పోస్టుమాస్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న పోలీసులు

తెనాలిరూరల్: రైస్ మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారంతో పోలీసులు గురువారం తనిఖీ చేశారు. పట్టణ ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని ఓ మిల్లులో రేషన్ బియ్యంతో బియ్యం రవ్వ, బియ్యప్పిండి చేస్తున్నారన్న పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. వారి ఆదేశాల మేరకు త్రీ టౌన్ పోలీసులు మిల్లుపై ఆకస్మిక తనిఖీలకు వెళ్లారు. 18 బస్తాల్లో బియ్యం రవ్వ, 10 బస్తాల్లో బియ్యప్పిండి, 30 బస్తాల్లో ఉంచిన బియ్యం, మిల్లులో మరి కొంత బియ్యాన్ని గుర్తించారు. 805 కిలోల బియ్యం రేషన్ బియ్యంగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

డాక్టర్ డానియేల్‌కు ప్రథమ బహుమతి



గుంటూరు మెడికల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ 50వ వార్షిక సదస్సు హైదరాబాద్ తార్నాకలోని ఎయిమ్స్‌లో ఈనెల 2 నుంచి 4 వరకు నిర్వహించారు. ఈ సదస్సులో నేషనల్ లోగో ప్రజంటేషన్ పోటీల్లో గుంటూరు జిల్లా చినకోండ్రుపాడు కాటూరి మెడికల్ కళాశాలకు చెందిన కమ్యూనిటీ మెడిసిన్ ప్రథమ సంవత్సరం విద్యార్థి డాక్టర్ సంకూరు డానియేల్ ఫిన్ని ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. స్వచ్ఛ భారత్ టీమ్‌పై పోటీలు నిర్వహించగా, చెత్త నుంచి గ్రీనరీని పెంపొందించవచ్చనే విషయాన్ని లోగో ద్వారా తెలియజేసినందుకు గానూ అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ హరి వాక్ష్‌చోప్రా నుంచి బహుమతి అందుకున్నారు. కాటూరి మెడికల్ కళాశాలలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ కె.ఎస్.వరప్రసాద్, కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహన్‌రావు, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌డీఓ డాక్టర్ ధూళిపాళ్ల ఫణీంద్ర తదితరులు డాక్టర్ డానియేల్‌ను అభినందించారు.

12న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో కళాసాధ ఆధ్వర్యంలో ఈనెల 12న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు బి.వేదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేదనాదం పుస్తకావిష్కరణ అనంతరం సూపర్‌స్టార్ కృష్ణ నటించిన చిత్రాల్లోని పాటలతో సంగీత విభావరి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంగీత అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

వేసవి ముగిసే లోగా.. తొలి విడత ఇళ్ల నిర్మాణం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



గోలీడొంకలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: నియోజకవర్గంలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో తొలి విడత మంజూరైన గృహ నిర్మాణాలు వేసవిలోగా పూర్తయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. పట్టణంలోని గోలీడొంక జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. మార్కింగ్ చేయించి, భూమి పూజ చేశారు. గృహ నిర్మాణ సంస్థ అధికారులు, పర్యవేక్షకులు, లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. నిర్ణీత గడువు లోగా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని, లబ్ధిదారులంతా ఇళ్లు కట్టుకునేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డుస్థాయిలో 27 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. గోలీడొంకలో ఈ సీజనుకు 1,400 ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఇదే కార్యాచరణతో నేలపాడు, సిరిపురం లే అవుట్లలోనూ నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నామని, డంపింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి, నిర్మాణ సామగ్రిని అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. గృహ నిర్మాణ సంస్థ ఈఈ భాస్కరరావు, డీఈ రఫీ, పార్టీ నాయకులు బూరెల దుర్గాప్రసాద్, అత్తోట చంటి, సిరికృష్ణ, పర్యవేక్షకులు బొమ్ము నాగిరెడ్డి, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, గోపాలం శరత్ పాల్గొన్నారు.

చిరస్మరణీయులు ఆలపాటి రవీంద్రనాథ్



దేవరపల్లి భవాని, కారంచేటి విజయకుమార్‌కు పురస్కారాల ప్రదానం

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ ప్రచురణకర్త, పత్రికాధిపతి ఆలపాటి రవీంద్రనాథ్, కళావతి దంపతుల సంస్మరణ సభ గురువారం స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించారు. ఆలపాటి కళావతి రవీంద్ర పీఠం ఆధ్వర్యంలో జరిగిన సభకు పీఠం అధ్యక్షుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. గీతాంజలి మూర్తి ముఖ్య అతిథిగా, ఎర్రంశెట్టి హనుమంతరావు ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. పీఠం శాశ్వత సభ్యుడు పావులూరి శ్రీనివాసరావు ఆలపాటి రవీంద్రనాథ్, కళావతి దంపతుల స్మారకోపన్యాసం చేశారు. ఆలపాటి రవీంద్రనాథ్ స్మారక పురస్కారాన్ని సాహితీ, సాంస్కృతిక సేవకురాలు దేవరపల్లి భవానికి, గ్రంథాలయోద్యమ ప్రముఖుడు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య పురస్కారాన్ని ప్రముఖ రచయిత కారంచేటి విజయకుమార్‌కు ప్రదానం చేశారు. విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్, వెంపటి సత్యనారాయణ, హైమావతి, తుమ్మల లక్ష్మీనారాయణ, బొల్లిముంత కృష్ణ, పీటీ అవధాని మాట్లాడారు. ఎస్.లావణ్య సుధ వందన సమర్పణ చేశారు. తొలుత రవీంద్రనాథ్, కళావతి, వెంకటప్పయ్య చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ డీ–1 సెక్షన్ పరిధిలోని బ్రాడీపేట, అరండల్‌పేట ప్రాంతాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం పర్యవేక్ష ఇంజినీర్ ఎం.అల్సన్, నగర ఈఈ శ్రీనివాసబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.విజయకృష్ణ నేతృత్వంలో సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించారు. 59 మంది అధికారులు, 177 మంది సిబ్బంది, 59 బృందాలుగా ఏర్పడి, 4,692 సర్వీసుల్ని తనిఖీ చేశారు. అనుమతి లేకుండా నేరుగా చౌర్యానికి పాల్పడుతున్న 139 మందికి రూ. 9.65 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతించిన కేటగిరి కాకుండా, ఇతర కేటగిరిల్లో విద్యుత్ వినియోగిస్తున్న ఐదుగురిపై రూ. 1.10 లక్షలు, అనుమతి లోడుకంటే అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న 134 మందికి రూ. 8.55 లక్షలు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా శ్రీనివాసబాబు మాట్లాడుతూ విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత్ విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయని తెలిపారు. వినియోగదారులంతా విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. సీలు లేకపోయినా, తుప్పు పట్టినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని చెప్పారు. పని చేయని మీటరు నుంచి విద్యుత్ వాడుతున్నా, ఉండాల్సిన దాని బదులు వేరే మీటరు పెట్టి సీలు లేకుండా ఉంటే చౌర్యంగా నిర్ధారిస్తామని పేర్కొన్నారు. మొదటి తప్పిదానికి కాంపౌండ్ పద్ధతిలో, రెండో తప్పిదానికి అరెస్టు చేస్తామని చెప్పారు. విద్యుత్ చౌర్యంపై సెల్ 9440812361కు వాట్సాప్ సమాచారం కూడా ఇవ్వవచ్చని తెలిపారు. దాడుల్లో విద్యుత్ అధికారులు ఎం.రవికుమార్, కె.రవికుమార్, ఎం.ముస్తాక్ అహ్మద్, కె.కోటేశ్వరరావు, కె.అంజినీరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ



మాట్లాడుతున్న ములకా శివ సాంబిరెడ్డి

తెనాలి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీకి తరలిరావాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి మంచికలపూడి సాంబశివరావు పిలుపునిచ్చారు. గురువారం చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో కోలనీడి రవికుమార్ అధ్యక్షతన రైతు, కార్మిక సదస్సును నిర్వహించారు. సాంబశివరావు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు, నెలకు రూ.10 వేలు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ఎనిమిదేళ్ల కాలంలో ప్రధాని నరేంద్ర మోడీ, అదానీ, అంబానీలకు ప్రజాధనాన్ని రూ.లక్షల కోట్లు దోచిపెట్టారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతోనే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచగలుగుతామన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, కేరళ తరహా రుణ విమోచన చట్టం చేయాలనేది ఛలో ఢిల్లీ కార్యక్రమం డిమాండ్లుగా చెప్పారు. షేక్ హుస్సేన్‌వలి, ముద్దన సాంబశివరావు, ములకా శివకుమారి, జి.వెంకటసుబ్బయ్య, రాచూరి వెంకటేశ్వర్లు, దేవళ్ల శ్రీను, పి.వసంత, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంపై కొత్త ఆలోచనలకు సదస్సు దోహదం

వీసీ ఆచార్య పి.రాజశేఖర్



సదస్సును ప్రారంభిస్తున్న వీసీ

ఏఎన్‌యూ: జీవ వైవిధ్యంపై కొత్త ఆలోచనల ఆవిష్కరణకు, నేడు మనిషి ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి జాతీయ సదస్సు దోహదం చేస్తుందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ జువాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ఇమ్యునాలజీ, ఆక్వాటిక్ టాక్సికాలజీ అండ్ బయోడైవర్సిటీ' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. సభకు హాజరైన వీసీ ప్రసంగిస్తూ సదస్సులో వక్తలు చెప్పే అంశాల్ని తమ పాఠ్యాంశాలకు జోడించి పరిశోధకులు, విద్యార్థులు కొత్త ఆలోచనలు చేయాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ బి. కరుణ మాట్లాడుతూ సదస్సులో చర్చించే అంశాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. సదస్సు సమన్వయకర్త కె. సునీత మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ జాతీయ సదస్సులో దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, పరిశోధన సంస్థల నుంచి జువాలజీ, బయోడైవర్సిటీ రంగ నిపుణులు హాజరై పలు అంశాలపై ప్రసంగించి పరిశోధన పత్రాలు సమర్పిస్తున్నారని తెలిపారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ శిష్టా రామకృష్ణ కీలకోపన్యాసం చేస్తూ కోవిడ్–19 బారినపడిన వారు వాడిన అనేక మందుల వల్ల తలెత్తే దుష్పరిణామాలు అధిగమించడంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అధ్యాపకులు పి. అనిల్, కె. శ్రీకాంత్ , విజ్ఞాన్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఎస్.ఎస్. సంపత్ కుమార్, సీహెచ్. అంజనీదేవి, సెంటర్ ఫర్ కంప్యూటేషనల్ అండ్ బయలాజికల్ సైన్సెస్ ప్రతినిధి పి.జాన్ ప్రసంగించారు. ఏఎన్‌యూ జువాలజీ, ఆక్వా కల్చర్ విభాగ అధ్యాపకులు పి.వి.కృష్ణ, సింహాచలం, పద్మావతి, సుమంత్ కుమార్, జగదీష్ నాయక్, గోపాలరావు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్‌కు అభినందన

యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎం. దేదీప్యను గురువారం వీసీ అభినందించారు. ఆమె జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన ఎన్ఎస్ఎస్ రిపబ్లిక్ డే పేరేడ్ శిబిరంలో, భారత సైన్యంతో కలసి నిర్వహించిన కవాతులో పాల్గొంది. యూనివర్సిటీకి చేరుకున్న ఆమెను వీసీ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి. కరుణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలారాణి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఎం. రవిశేఖర్, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ డి. రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎన్‌జీతో కాలుష్య నియంత్రణ

ఐఓసీఎల్ ఈడీ సంజయ్‌కుమార్



కారులో సీఎన్‌జీ నింపుతున్న సంజయ్‌కుమార్

పాత గుంటూరు: సీఎన్‌జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) వాహనాలను వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.సంజయ్‌కుమార్ తెలిపారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని పొన్నూరు రోడ్డు, హైవేలోని ఐఓసీఎల్ పెట్రోలు బంకుల్లో గురువారం సీఎన్‌జీ పరికరాల్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎన్‌జీ వాడకం వల్ల కాలుష్య నియంత్రణతో పాటు, డీజిల్, పెట్రోలు కన్నా వ్యయం తగ్గుతుందని తెలిపారు. పెట్రోలు కంటే 40 శాతం అధికంగా మైలేజీ అందిస్తుందని చెప్పారు. రానున్న కాలంలో నివాసాలకు పైపులైను ద్వారా గ్యాస్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఢిల్లీ ఈడీ సంజయ్‌కుమార్ ఝా, ఆంధ్ర, తెలంగాణ ఈడీ బి. అనిల్ కుమార్, ఐఓసీఎల్ గుంటూరు ఇన్‌చార్జి జె. అనిల్ కుమార్, పెట్రోలు బంకుల డీలర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం



గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికంగా దృఢంగా ఉండగలరని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా తెలిపారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం ఏఎన్‌యూ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని సూచించారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడతాయని, విద్యార్థినులు క్రీడల్లో తప్పనిసరిగా ప్రావీణ్యం సంపాదించాలని ఆయన సూచించారు. పవర్ లిఫ్టింగ్ క్రీడలో పురుషులతో పాటు మహిళలు సైతం పాల్గొని సాధన చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర వీఆర్ జ్యోత్స్నకుమారి, క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మస్తాన్‌షా ఉరుసు మహోత్సవాలు

పాత గుంటూరు: గుంటూరు జీటీ రోడ్డులోని హజరత్ కాలేమస్తాన్‌షా ఆవులియా ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దర్గా ధర్మకర్త రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన గంధం మహోత్సవం నగర ప్రధాన వీధుల్లో కొనసాగుతూ గురువారం ఉదయం 10 గంటల వరకు ఘనంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. బాబా దర్శనానికి వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 4 గంటలకు గంధ పంపిణీ, దీపారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగర ప్రముఖులు, భక్తులు విశేష సంఖ్యలో బాబా సమాధిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.